


బస్తర్‌లో




# జనతన జైత్రయాత్ర

డి మార్కండేయ

# బస్తర్‌లో జనతన జైత్రయాత్ర

డి మార్కండేయ







విప్లవ రచయితల సంఘం

# బస్తర్‌లో జనతన జైత్రయాత్ర

డి. మార్కండేయ

విప్లవ రచయితల సంఘం

బస్తర్‌లో **జనతన జైత్రయాత్ర**

**డి. మార్కండేయ**

విరసం ప్రచురణ
22 ఏప్రిల్, 2013

కవర్ డిజైన్ : శ్రవణ్ కుమార్
లేఅవుట్ డిజైన్ : రఘు తిరుపతిరెడ్డి మోతె

వెల: 20/-

**ప్రతులకు**
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్.
సహచర బుక్ మార్క్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.
నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

ముద్రణ
చరిత ఇంప్రెషన్స్, ఆజమాబాద్,
హైదరాబాద్ - 500 020.

# అడవితల్లి పిలుపు

అడవికెళ్లడం అంత సులభం కాదు. పర్యాటకానికో, కొండలు ఎక్కి దిగడానికో, జలపాతాలను చూడడానికో అయితే అడవీ తల్లికి దండాలో అని వెళ్లవచ్చు. అడవీతల్లి అందం చూడు అని కూడా అనుకోవచ్చు. మూడు దశాబ్దాలుగా అడవి ప్రత్యేకంగా ఇప్పుడు యుద్ధ వాతావరణంలో ఉన్న అడవి వార్తల్లో ఉంది. ఇప్పుడది విస్తరించింది. ఈ అడవికి, తెలుగునేల రాజకీయాలకి తల్లిపేగు సంబంధం ఉంది. దండకారణ్యం ఇప్పుడు దేశ ప్రజలనే కాదు. మేధావులను, బుద్ధిజీవులనే కాదు. పాత్రికేయులనే కాదు. ప్రపంచాన్నే ఆకర్షిస్తున్నది. ఆ అడవిలో మొలకెత్తి విస్తృతంగా పాకిపోతున్న ప్రత్యామ్నాయ ప్రపంచాన్ని చూడమని పిలుస్తున్నది. ఈ అడవి గర్భంలో జరుగుతున్న అన్ని వ్యవహారాలకు, విప్లవాలకు తెలంగాణకూ సంబంధం ఉంది. అక్కడి వార్త ఇక్కడ ప్రకంపనాలు సృష్టిస్తుంది. అక్కడి మరణాలు ఇక్కడ కన్నీటి కడలులను సృష్టిస్తాయి. డెబ్బైవ దశకంలో శ్రీకాకుళం నుంచి ఉత్తర తెలంగాణకు వ్యాపించింది నక్సల్బరీ. జగిత్యాల, సిరిసిల్ల పోరాటాలు వెల్లువెత్తాయి. జైత్రయాత్ర ఉత్తర తెలంగాణను కదిలించింది. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ నక్సల్బరీ పోరాట కేతనాలయ్యాయి. రైతుకూలీ పోరాటాలు, ప్రజా సంఘాల పోరాటాలు 1981 నాటికే మరో రూపం తీసుకున్నాయి. పీపుల్స్‌వార్ ఏర్పడిన మరుసటి సంవత్సరమే అది దళాలుగా విస్తరించే ప్రణాళిక వేసింది. బస్తర్ నుంచి ఒరిస్సా దాకా ఉన్న అటవీ ప్రాంతం గెరిల్లా జోన్‌లుగా అభివృద్ధి పరిచే ప్రణాళికలో భాగంగానే పీపుల్స్‌వార్ దళాలు ఏర్పాటు చేసింది. గోదారి ఇద్దరి దాటి అద్దరి సిరొంచ మహారాష్ట్రకు పెద్ది శంకరన్న దళమై వెళ్లిపోయిండు. ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిండు. పెద్ది శంకరన్నా దళం పోరెల్లిపోంగ రావనా ఉయ్యాలో అని స్మృతి గీతం అయిండు. అప్పుడే మరో మూడు దళాలు ఇటు బస్తర్‌లో బస చేశాయి. అప్పటి నుంచి ఇన్నాళ్లకు అలనాటి పీపుల్స్‌వార్ ఉద్యమం మావోయిస్టు పార్టీగా సమీకృతమై అటు నిజంగానే తిరిగి తిరిగొచ్చిన నక్సల్బరీ గానం ఎత్తుకున్న లాల్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా దాకా ఇవ్వాళ్ల అడవి ప్రత్యామ్నాయ రాజకీయాలకు కేంద్రమైంది.అబూజ్‌మాడ్ కొండలు కేంద్రంగా మావోయిస్టు ఉద్యమం విస్తరించి, ప్రజల ప్రత్యామ్నాయ బీజరూప అధికారం, కంపెనీలు, బెటాలియన్లు కలి స్వంత సైన్యం, ప్రజల నేతృత్వంలో మిలీషియాగా ఎదిగి స్థానిక జనతన సర్కార్లుగా ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నది.

లాల్‌గఢ్ నుంచి ఛత్తీస్‌గఢ్ దాకా విస్తరించిన ఈ ఉద్యమం ప్రధానంగా ఆదివాసీలను విప్లవంలోకి తెచ్చింది. మధ్య భారతం మొత్తం ఆవరించి ఉన్న ఖనిజ సంపదపై ఎంవోయూలుగా పరుచుకుని కూచున్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఈ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న దళారీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ అడవిలో ఆదివాసీల పక్షాన సాయుధ పోరాటం విస్తృతమైంది. ఛత్తీస్‌గఢ్ గిరిజనులకు మావోయిస్టు పార్టీ వ్యవసాయం నేర్పుతున్నది. నదిలో ప్రవహించే నీటిలో సాగుతూ పోయే అభ్రకం గనులను కాపాడుకోవడానికి గిరిజనుల సాంప్రదాయ పోరాట పటిమను భూంకాల్ మిలీషియాను ఏర్పరచడంలో మావోయిస్టు పార్టీ కృషి చేసింది. మా రాజ్యం మాకే. మా అడవి మాకే. మా ఊళ్లో మా ప్రభుత్వం ఇప్పుడు దండకారణ్యం నినాదం.

ఆ అడవుల్లో నాయకత్వం వహిస్తున్నది ఇక్కడ 70వ దశకంలో జగిత్యాల జైత్రయాత్రగా కదిలి 80లలో మధ్య భారతంలో విస్తరించిన తెలంగాణ నాయకత్వమే. ఆ విస్తరణ లేకపోతే ఇప్పుడు మధ్య భారతంలో విస్తరించిన, పురుడు పోసుకుని ఎదిగిన జనతన సర్కార్లు లేవు. అది మూడు

దశాబ్దాలకు పైబడిన శ్రమ. చెమట, నెత్తురు కాల్వలై పారిన కన్నీటి సముద్రాలు. శవాలై తిరిగివచ్చిన అనేకమంది విప్లవకారులు. నిన్నగాక మొన్న జరిగిన సరిహద్దు ఎన్‌కౌంటర్‌లో కూడా వరంగల్ విప్లవకారులు మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లో దంతేవాడ, బీజాపూర్, సుక్మా, నారాయణపూర్ జిల్లాలలో మూడంచెల స్థాయి పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న బీజరూప ఈ ప్రత్యామ్నాయ అధికారం కోసం ఇప్పుడు ఆదివాసీలు సమీకృతమవుతున్నారు. సహజంగానే ఇది రాజ్యానికి కంటగింపుగా మారింది. ప్రధాన శత్రువుగా మావోయిస్టులు కనబడ్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచాయి. ఆదివాసీలను ఏ ప్రభుత్వమూ కనీసం పట్టించుకోలేదు లేదు. చట్టాలు అమలయిందీ లేదు. కానీ మావోయిస్టులు ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థగా అభివృద్ధి చెందే సరికి అసలైన బెడదగా తోచాయి. గ్రీన్‌హంట్ ప్రారంభమయింది.

ఇదిగో ఇట్లాంటి అడవి అరుంధతీరాయ్, యాన్ మిర్డాల్‌ల నుంచి అందరినీ ఆకర్షిస్తూనే ఉన్నది. నిజానికి ఆదివాసులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు, స్థానిక ఖనిజ సంపదను ప్రజల ఉపయోగార్థం పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు ఆదివాసీలను క్రూరంగా అణచివేయడానికి పారామిలటరీ బలగాలను దించాయి. ఆదివాసీల మధ్య నీళ్లలో చేపల్లా కలిసిపోయిన మావోయిస్టులకు, విశాల ఆదివాసీ ప్రజానీకానికి, భారత ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న ఈ యుద్ధం ఎట్లా ఉన్నది. నిజానికి అక్కడ ఏమి జరుగుతున్నది. విప్లవకారుల స్థితిగతులేమిటి? ఇవన్నీ ఆసక్తులే. తెలుగు నేలపై విప్లవం వెనుకంజలో ఉంది 70ల నుంచి 90ల దాకా ఇక్కడ విప్లవోద్యమం బలపడింది. విస్తరించింది. కదిలించింది. కానీ అది ఆ తర్వాత తీవ్ర నిర్బంధంలో మధ్య భారతానికి విస్తరించింది.

బాసగూడలో పంటల పండుగ జరుపుకుంటున్న ఆదివాసీలపై పారామిలటరీ, కోబ్రా బలగాలు కాల్పులు జరిపి, అన్నెంపున్నెం ఎరుగని పసివాళ్లతో సహా 13మంది ఆదివాసీలను పొట్టనబెట్టుకున్నాయి. సల్వాజుడుం, కోయ కమెండోలు నిత్యం గూడాలను తగులబెట్టడం, మహిళలను చెరచడం అడవి ఇప్పుడొక నిర్బంధ శిబిరం. చింతల్నార్ లాంటి ఘటనలు జరిగిన అనంతరం యూనిఫైడ్ కమాండ్ ఫోర్స్, కోబ్రా లాంటి బలగాలు సంయుక్తంగా, ఉమ్మడిగా ఆపరేషన్లు నెరుపుతున్నవి. ఒక దశలో ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ అడవిలో చివరికి జర్నలిస్టులయినా ఎన్‌కౌంటర్ కావొచ్చు అని ప్రకటించేదాకా పోయింది. బినాయక్‌సేన్ లాంటి జీవితమంతా ఆదివాసీలకు వైద్యం అందించిన డాక్టర్ జైలు పాలు కావలసి వచ్చింది. సోనీసోరి లాంటి కేసులు ఛత్తీస్‌గఢ్‌లో మానవహక్కుల ఉల్లంఘనలు ఎంత పెద్ద ఎత్తున జరుగుతున్నాయో సూచికలయ్యాయి.ఆకు కదిలితే తుపాకులు పేలే ఈప్రాంతం చేరాలంటేనే ఒక భయం. గతంలో సి. వనజ జనతన సర్కార్‌పై ఆంధ్రజ్యోతిలో ఒక వార్తాకథనం రాసింది. అది సంచలనమైంది. ఆమెకు అవార్డు కూడా వచ్చింది. ప్రాణాల మీద ఆశలు వదులుకొని, దేనికైనా సిద్ధపడితే తప్ప ఈ ప్రాంతం సందర్శించడం, అక్కడి నిర్బంధాన్నో, జీవన విధానాన్నో, జీవితంలో భాగమైపోయిన ఆదివాసీల ఆరాట పోరాటాలనో ప్రతిబింబించడం అంత సులభం కాదు. ముందు సరిహద్దులు దాటాలి. గ్రేహౌండ్స్‌ను దాటాలి. సల్వాజుడుంను, ఇన్‌ఫార్మర్లను దాటితే గానీ అప్పుడు దండకారణ్యం ఆహ్వానించదు. అది మరో లోకం.

ఆ అడవికి రారమ్మని వచ్చిన పిలుపుతో మా నెట్‌వర్క్ ఇన్‌చార్జి డి. మార్కండేయకు ఆహ్వానం అందినప్పుడు ఇన్నేసి భయాలు కదలాడినవి. నక్సలైట్ నాయకులను ఇంటర్వ్యూ చేయడానికి అడవికెళ్లడం రాష్ట్ర జర్నలిస్టులకు కొత్తగాదు. ముప్పాళ లక్ష్మణరావు మొదలుకొని ఆర్‌కె దాకా ఇట్లా అన్ని సందర్భాల్లోనూ విలేకరులు అడవికి వెళ్లడం, నిర్బంధ వాతావరణంలో పోలీసుల కళ్లు గప్పి, కోరి

యర్ వ్యవస్థ లాంటి వాటిని రహస్య నిర్మాణ పద్ధతులను స్వయంగా పాటించి అడవి నుంచి బయటకు రావడం చాలామంది అనుభవమే. నిజానికి ఆర్‌కె. గణేష్, సుధాకర్‌లతో నల్లమలలో ఇంటర్వ్యూకు వెళ్లిన పాత్రికేయుల ద్వారానే పీపుల్స్‌వార్‌తో చర్చలు ఒక కీలక దశకు వచ్చాయి. అప్పుడు ఆర్‌కె తదితరులను విలేకరులు బేషరతుగా మీరు చర్చలకు సిద్ధమా? అని ప్రశ్నించడం, వాళ్లు బేషరతుగా చర్చలకు సిద్ధమే అనడం అది మీడియాలో వచ్చినాక చర్చల క్రమం పుంజుకోవడం అందరికీ తెలిసిన విషయమే. రహస్య నిర్మాణాలు గల పార్టీలకు బయటకు తమ అభిప్రాయాలు చేరవేయడానికి సెలెక్టెడ్‌గా విలేకరులను పిలిపించుకొని మాట్లాడడమూ పరిపాటే. కానీ ఛత్తీస్‌గఢ్ అడవులకు పాత్రికేయులు కానీ అరుంధతీరాయ్, యాన్ మిర్డాల్, సత్నామ్‌సింగ్, నవ్లాఖా లాంటి వారు, మిగతా జర్నలిస్టులు అక్కడి పరిస్థితులనుఅధ్యయనం చెయ్యడానికి వెళ్లారు. నిజానికి విప్లవోద్యమం అణచివేతకు రాజ్యం దుష్ప్రచారం, విష ప్రచారం అనే సమాచార అస్త్రాన్ని కూడా ఉపయోగించుకుంటుంది. చాలా సందర్భాల్లో తప్పుడు సమాచారాన్ని ఇచ్చి విప్లవ శ్రేణుల్లో గందరగోళం సృష్టించడం, మరోవేపు ప్రజల్లో నక్సలైట్లపై విద్వేషాన్ని రగిలించడం అనే రెండంచుల కత్తిలా సమాచారాన్ని ఉపయోగించుకుంటూ ఉంటారు. అట్లాంటి సందర్భాల్లో క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతున్నది. అసలు అక్కడ నిర్మాణమవుతున్న మరో ప్రపంచం ఉందా? ఉంటే అది ఎట్లా ఉన్నదన్న పాత్రికేయ కథనాలు బయటి ప్రపంచానికి వాస్తవాలను తెలుపుతాయి. అందుకే పాత్రికేయులకు ప్రపంచవ్యాప్తంగా రహస్య ఉద్యమాలను పరిశోధించడం, అధ్యయనం చేయడం, పరిశీలించడం ఒక సావకాశం అనుకోవచ్చు. చాలామంది అందుకే యుద్ధాల్లో, విప్లవాల్లో చరిత్రాత్మక పాత్ర నిర్వహించి పాత్రికేయ లోకానికి ఆదర్శప్రాయులయ్యారు. మార్కండేయను అడవికి వెళ్లాలని ప్రోత్సహించింది అందుకే. పాత్రికేయునికి అంతకుమించిన అవకాశం దొరకదు. కానీ మరోవేపు  పాత్రికేయ పరిమితుల వల్ల, అలవాటయిన జీవితం, అనుకోని ప్రమాదాలు లాంటివి ఆలోచించినప్పుడు కలిగే సందిగ్ధతలను జయించి మార్కండేయ సంసిద్ధత ప్రకటించి అడవికి వెళ్లాడు. అక్కడి నిజ వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ నమస్తే తెలంగాణలో ఆరు రోజులు వార్తా కథనాలు రాశాడు. అయితే ఒక సంపాదకునిగా మార్కండేయకు ఒక సలహా ఇచ్చాను. ఇట్లాంటి వార్తా కథనాలు రాసేటప్పుడు వాస్తవాల ఆధారంగా రాయాలని, ఒక పక్షం వహించకుండా, కథనాల్లో ఆబ్జెక్టివిటీ ఉండాలని.. మార్కండేయ ఈ కథనాలను పరిశీలకునిగా రాశాడు. నిజానికి రాజకీయేతరంగా మనుషులుండరు. పాత్రికేయులూ ఉండరు. జరుగుతున్న ఏ విషయాలపైనైనా అభిప్రాయం ఏర్పరచుకోకుండా జర్నలిస్టులుంటారంటే నమ్మాల్సిన పనిలేదు. కానీ పాత్రికేయుల అభిప్రాయాలు పత్రికల్లో సంపాదక పేజీకి, పరిమితం కావాలని, వార్తా కథనాలకు ఆబ్జెక్టివిటీ ఉండాలని చిత్తశుద్ధితో నమ్మే జర్నలిస్టులముగా మార్కండేయ అయినా మరెవరైనా ఇదే సూత్రంగా నమ్మే వాణ్ని కనుక ఆయనకు ఆ సలహా ఇచ్చాను. మార్కండేయ గురించి తెలిసిన వాడిగా అతను రాసిన ఈ వార్తా కథనాలు లక్ష్యాన్ని సాధించాయని భావిస్తున్నాను. అందుకు మార్కండేయకు మానస్ఫూర్తిగా అభినందనలు. ఒక సవాల్‌గా తీసుకుని, దండకారణ్యంలో ఆరు రోజులు ఉద్రిక్తంగా గడిపి, ఒకానొక రోజు చివరికి పారామిలటరీ బలగాలకు కూతపెట్టు దూరంలోనూ సంచరించి విజయవంతంగా అడవికేగి వచ్చిన మార్కండేయ మరిన్ని ఇలాంటి వార్తా కథనాలు రాయాలని కోరుకుంటూ...

**–అల్లం నారాయణ**

# మరో ప్రపంచం పిలిచింది..

నమస్తే తెలంగాణ దినపత్రిక తరపున నా ఛత్తీస్‌గఢ్ పర్యటన ఎంతో ఉద్వేగభరితంగా ఆరు రోజులు కొనసాగింది. నిత్యం రద్దీతో రణగొణ ధ్వనుల మధ్య ఇరుకు గదుల్లో ఫోన్లతో మాట్లాడుతూ టీవీలతో సావాసం చేస్తూ ఫేస్‌బుక్కుల్లో పలకరిస్తూ తెచ్చిపెట్టుకున్న మర్యాదలతో రేపటి గురించిన ఆందోళనతో బతికే మాకు ఆంధ్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో గల జనతన సర్కారు చెక్‌పోస్టు దాటగానే మరో ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లనిపించింది. ఆ ప్రపంచంలో సమష్టి తత్వం సర్వవ్యాపితం. బతుకైనా, చావైనా, పండుగైనా, పోరాటమైనా అన్నీ కలిసే. లగ్జరీలు, సౌకర్యాలు అక్కడి వారికసలు తెలియవు. శతాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉండి ఇప్పుడిప్పుడే కనీసావసరాలను సమకూర్చుకుంటున్నారు. పచ్చని అడవులు.. స్వచ్ఛమైన సెలయేళ్లు.. వెచ్చని వాతావరణం. నిష్కల్మషమైన మనుషులు. అక్కడక్కడా తటస్థపడే నెమళ్లు.. కుందేళ్లు.. జింకలు.. నిజానికి మా ఎడిటర్ గారు నన్ను ఛత్తీస్‌గఢ్ వెళతావా అని అడిగినప్పుడు మొదట తటపటాయించాను. లక్షకు పైబడిన ప్రభుత్వ బలగాలు మావోయిస్టు గెరిల్లాలతో తలపడుతున్న యుద్ధక్షేత్రంలోకి వెళ్లడం అనవసర రిస్కేమోననిపించింది. అయితే ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధికెక్కిన మధ్యభారత విప్లవోద్యమం, అక్కడ కొలువైన జనతన సర్కార్ల గురించి, పాలకులు అమలుచేస్తున్న పాశవిక నిర్బంధం గురించి తెలంగాణ సమాజానికి తెలియజేయడం సామాజిక బాధ్యతగా భావించాను. జాన్ మిర్డాల్, అరుంధతీరాయ్ వంటి ప్రముఖులే కాకుండా గౌతం నవలఖా, రాహుల్ పండితా, తుషా మిట్టల్ వంటి జర్నలిస్టులు కూడా బస్తర్‌కు వెళ్లడం స్ఫూర్తినిచ్చింది. మా ఎడిటర్ గారు, సీఈఓ గారు ఇచ్చిన భరోసాతో చివరకు ఛత్తీస్‌గఢ్ టూర్‌కు ఓకే చెప్పాను.

ఫిబ్రవరి 20 రాత్రి నేను, మరికొందరు మీడియా మిత్రులం హైదరాబాదులో బయలుదేరాం. మరునాడు ఉదయానికల్లా ఛత్తీస్‌గఢ్ సరిహద్దున ఉన్న ఓ మండల కేంద్రానికి చేరుకున్నాం. మమ్మల్ని తీసుకెళ్లడానికి రావాల్సిన గ్రామస్తులు ఏ కారణం చేతో రాలేదు. ఏం చేద్దామని ఆలోచిస్తుంటే నాతో వచ్చిన ఇతర మిత్రులు వాహనాన్ని నేరుగా బార్డర్ చివరి గ్రామానికి పోనిద్దామన్నారు. అలా వెళుతున్న క్రమంలో పెట్రోలింగ్ చేస్తున్న ఓ గ్రేహౌండ్స్ బ్యాచ్ నుంచి జస్ట్ మిస్సయ్యాం. చివరి గ్రామం చేరుకున్నాం. అక్కడ ఆరా తీస్తే అన్నల జాడ తెలిసింది. మమ్మల్ని రిసీవ్ చేసుకోవాల్సినవాళ్లు కూడా కలిశారు. అందరం కలిసి కాలినడకన గంటన్నర వెళ్లాం. ఓ పల్లె వచ్చింది. అక్కడ ఓ చింతచెట్టు నీడన అప్పటికే మా కోసం భోజనం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ లోగా మావో



ఆదివాసీ బాలలు



ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామం వద్ద జనతన సర్కారు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

యిస్టు పార్టీ పంపిన ఓ వార్తాహరుడు వచ్చి మా షెడ్యూల్ చెప్పాడు. మరో నాలుగు గంటల ప్రయాణం తర్వాత తొలిమజిలీ చేరుకుంటారని, అక్కడ మీకు స్థానిక జనతన సర్కారు ఆతిథ్యమి స్తుందన్నాడు. కొంతదూరంలో ఉన్న చెక్‌పోస్టును చూపిస్తూ మీరు జనతన సర్కారు ఆధీనంలో గల ప్రాంతంలోకి ప్రవేశించబోతున్నారని గుర్తు చేశాడు.

ఇద్దరు స్థానికులు వెంట రాగా మేము బయలుదేరాం. చెక్‌పోస్టు పక్కనున్న రెండు అమరుల స్తూపాల వద్ద ఫోటోలు దిగాం. తర్వాతి గ్రామంలో పంటల పండుగ జరుగుతుంటే కాసేపు ఆగాం. స్త్రీ పురుషులు ఎంతో ఉత్సాహంగా ఆనందంగా చేస్తున్న సంప్రదాయ నృత్యాలను తిలకించాం. దారిలో గ్రామగ్రామాన పొలిమేరల్లో మమ్మల్ని మావోయిస్టు మిలీషియా సభ్యులు ఆపడం, ఎవ రని ఆరా తీయడం, మా వెంట ఉన్నవాళ్లు ఏవో విషయాలు చెప్పగానే లాల్‌సలాం అంటూ సంతో షంగా మాతో చేతులు కలుపడం కొనసాగింది. ఎవరైనా కొత్త ముఖాలు వస్తే ఈ మిలీషియా కళ్లు గప్పి వాళ్లు లోపలి గ్రామాలకు వెళ్లడం సాధ్యం కాని విషయమని మాకు అర్థమైంది. రాత్రి ఏడు గంటలకల్లా మేము గమ్యం చేరాం. స్థానిక సర్కారు అధ్యక్షుడు, ఇతర ప్రతినిధులు మమ్మల్ని ఆప్యా యంగా పలకరించారు. నీళ్లు, టీ ఇచ్చి ప్రయాణ క్షేమ సమాచారాలడిగారు.

తర్వాత రెండు రోజులూ మేము ఈ గ్రామంలోనే ఉండి జనతన సర్కారుకు సంబంధించిన పని తీరును పరిశీలించాం. గ్రామస్తులు ఉమ్మడిగా నిర్మించుకుంటున్న చెరువు దగ్గరకు వెళ్లాం. సమష్టి వ్యవసాయ క్షేత్రంలో పండించిన వేరుశనగ పంటను పరిశీలించాం. జనతన సర్కారు నెలకొల్పిన బడిని, హాస్పిటల్‌ను చూశాం. పొద్దునే తాగిన అలిసెంతలతో కూడిన బియ్యపు జావ నుంచి టమా టలు, వంకాయల వరకు సమష్టిగా స్థానికంగా పండించినవేనని తెలిసి ఆశ్చర్యపోయాం. ఇక్కడే మాకు మావోయిస్టు పామేడ్ ఏరియా కమిటీ కార్యదర్శి సోని కలిసింది. ఆయుధాలేమీ లేకుండా స్థానికుల్లో కలిసిపోయి ఉన్న ఆమెను కేవలం తెలుగులో మాట్లాడడాన్ని బట్టి గుర్తు పట్టాం. మీరు ఏపీ వాళ్లా అని అడిగితే ఔనంది. అక్కడి వాళ్లు చాలా మందే ఉన్నారా అంటే లేరంది. మీకు గోండి భాష రాదు కనుక సాయపడడానికి పార్టీవాళ్లు నన్ను పంపించారంది. దక్షిణ బస్తర్ డివిజన్ మొత్తా



పంటల పండుగ సందర్భంగా ఆదివాసీ మహిళల నృత్యాలు

నికి తానొక్కతే బయటిదాన్నని, మిగతా వాళ్లంతా స్థానిక భూమిపుత్రులేనని వివరించింది. ఒక రోజంతా ఆమెతో మాట్లాడి పలు అంశాలను అడిగి తెలుసుకున్నాం. ఇలా నిరాయుధంగా ఉంటే భయం వేయదా అని అడిగితే ఆయుధం ఇచ్చే రక్షణ పాక్షికమేనని, ప్రజల మద్దతే తమను బతికిస్తున్నదని తెలిపింది. తమకు తెలియకుండా పోలీసులు కాని, ఇన్ఫార్మర్లు కాని లోపలికి రాలేరని ధీమాగా చెప్పింది.

మేమున్న ఇంటికి పదుల సంఖ్యలో జనాలు రావడం, మాతో, సోనితో మాట్లాడిపోవడం నిరంతరం కొనసాగింది. సరిగ్గా ఉదయం 6.45, సాయంత్రం 6.15 కాగానే సోని తన రేడియో తెచ్చి మాకిచ్చేది. వార్తలు వినమని చెప్పేది. అలా మేం హైదరాబాద్‌లో జరిగిన బాంబు పేలుళ్ల గురించి తెలుసుకోగలిగాం. హైదరాబాద్‌లో ఉంటే ఈ ఘటనపై హల్‌చల్ చేయడంలో మునిగిపోయివుండేవాడివని మా వెంట ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా మిత్రున్ని ఆటపట్టించాం. బయటి ప్రపంచం గురించి తెలుసుకునేందుకు తమకున్న ఏకైక ఆధారం రేడియో ఒక్కటేనని సోని చెప్పింది. మేము అక్కడి నుంచి వెళ్లిపోయే రోజు ఉదయం మాకు జనతన సర్కారు నాటుకోడి కూరతో విందు భోజనం పెట్టింది.

ఆ సాయంత్రం పీడియా, తుమ్‌నారు ప్రాంతానికి బయలుదేరాం. ఈసారి అదృష్టం మమ్మల్ని వరించింది. జనతన సర్కారు మా కోసం మూడు మోటార్‌సైకిళ్లను సంపాదించింది. ఆ వాహనాల ఓనర్లతో కలిసి ఒక్కో బండిపై ముగ్గురం చొప్పున ఎక్కాం. ఇవే బండ్లపై తిరుగు ప్రయాణమూ చేశాం. ఆ గ్రామస్తులకు డ్రైవింగ్ పర్‌ఫెక్ట్‌గా రాకపోవడంతో మాలో ముగ్గురం ఆ పని చేశాం. వెనకాల ఇద్దరు కూర్చోగా అడవిలోని కాలిబాటల గుండా, కొండలు గుట్టలనెక్కిస్తూ వాగులు వంకలు దాటుతూ ముందుకు సాగడం మరిచిపోలేని అనుభూతి. దురదృష్టవశాత్తూ ఎప్పుడైనా ఉద్యోగం

పోతే ఏ సర్కస్ కంపెనీలో ట్రై చేసినా ఈజీగా ఉద్యోగం వస్తుందని మాలో ఎవరో జోక్ చేశారు కూడా.

పీడియా కంటే ముందు అనుకోకుండా మాకు జేగురుగొండ ఏరియా కమిటీ కార్యదర్శి పాపారావు కలిసాడు. ఆయన వెంట లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్(ఎల్ఓఎస్) ఉండడంతో పీఎల్జీఏ ఫొటోలు లేవనే నిరాశతో ఉన్న మాకు ప్రాణం లేచివచ్చింది. ఫొటోలు లేకపోతే వార్తలు ఆకట్టుకోవని చెబితే పాపారావు సమ్మతించాడు. కాకపోతే వెనుకనుంచే తీసుకోవాలని షరతు పెట్టాడు. వివరంగా ఇంటర్వ్యూ కూడా ఇచ్చాడు. అక్కడి నుంచి బయలుదేరి పీడియా గ్రామం చేరాం. జనవరి 21న వేయిమంది ప్రభుత్వ బలగాలు దాడిచేసి తగులబెట్టినట్లుగా చెబుతున్న కొన్ని ఇళ్లను, జనతన సర్కారు ఆశ్రమ పాఠశాలను పరిశీలించాం. బూడిద తప్ప అక్కడ ఏమీ మిగిలిలేదు. మా వంక దీనంగా చూస్తున్న ఆదివాసీ మహిళలను, పిల్లలను చూస్తుంటే హృదయం ద్రవించింది. మనుషులంతా ఒక్కటే అయినప్పుడు కొందరు సకల సంపదలు అనుభవించడం, మరికొందరు ఇలా జంతువుల వలే బతుకులు వెళ్లదీయడమేమిటన్న ప్రశ్న మమ్మల్ని బాధించింది.

ఇక్కడే మేము కొంచెం డేంజర్లో పడ్డాం. 24వ తేదీన సుమారు వేయి మంది బలగాలు వివిధ క్యాంపుల నుంచి బయలుదేరి కోర్సి అనే ఊరికి వచ్చి మకాం చేసినట్లు సమాచారం అందింది. ఆ ప్రదేశం మేమున్న చోటికి కేవలం 5 కి.మీ.ల దూరంలోనే ఉండడంతో బాగా టెన్షన్ పడ్డాం. ఆ రాత్రి ఊరిలో కాకుండా పక్కన ఉన్న గుట్టపై నిద్రించాం. మరునాడు ఉదయం పీడియా జనతన సర్కారుకు సంబంధించిన గ్రామసభ నిర్వహిస్తుంటే దూరంగా మోర్టార్ షెల్స్ పేలిన శబ్దాలు వినిపించాయి. అయినా అక్కడ గుమికూడిన వాళ్లెవరూ గాబరా పడలేదు. మావోయిస్టు పీఎల్జీఏ కంపెనీ ఒకటి ప్రభుత్వ బలగాలను నిలువరించి పోరాడుతోందన్న సమాచారం అందడంతో జనం పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపించారు. సభలో ప్రభుత్వ బలగాలు తమను పెడుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. కొందరైతే ఆవేశంతో భారత సైన్యానికి ఇక్కడేం పని.. వెనక్కి వెళ్లాలని నినదించారు.

ఆ సాయంత్రం బయలుదేరి రోజంతా ప్రయాణించాం. మధ్యలో అనుకోకుండా ఎన్టీఎస్జడ్సీ అధికార ప్రతినిధి జగన్ తటస్థపడ్డారు. మా డిమాండ్ మేరకు తెలంగాణ తదితర అంశాలపై రెండు గంటల పాటు మాతో మాట్లాడారు. ఆయన కలిసిన ఉత్సాహంలో మేము మా అలసటను మరిచిపోయాం. ఇంత కష్టపడి వచ్చినందుకు ఓ నాయకుడు దొరికాడనుకున్నాం. ఆ రాత్రికి మరో గ్రామం చేరి అక్కడ విశ్రాంతి తీసుకున్నాం. 26వ తేదీన తిరిగి బయలుదేరి రాత్రి 10 గంటలకల్లా బయటి ప్రపంచంలోకి ప్రవేశించాం. మా ఫోన్లలో నెట్‌వర్క్ రాగానే అందరమూ చిందులేశాం. మూడు రోజులన్న జర్నీ ఆరు రోజులకు పెరిగి, పేపర్లలో ఎన్కౌంటర్ వార్త చదివి ఏమైందోననే ఆందోళనతో ఏడుపొక్కటే తక్కువైన మా కుటుంబాలకు మొదటి కాల్ చేశాం. రెండవ కాల్ నేను మా ఎడిటర్ గారికి చేశా. మరికొందరితో మాట్లాడి మా తిరుగుప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నాం. 27 ఉదయం హైదరాబాద్‌కు చేరుకుని హాయిగా ఊపిరి పీల్చుకున్నాం.

**–డి మార్కండేయ**



గ్రామ్‌సభలో మాట్లాడుతున్న జనతన సర్కారు అధ్యక్షుడు

## 1

మధ్యభారత అడవుల్లో ఓ కొత్త వ్యవస్థ పురుడు పోసుకుంటోంది. దేశ వనరులను బహుళజాతి సంస్థలకు దఖలు పరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై అక్కడి ఆదివాసీలు తిరగబడు తున్నారు. మావ నాటె మావ రాజ్ (మా ఊళ్లో మా ప్రభుత్వం) నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అండతో ఊరూరా క్రాంతికారీ జనతన సర్కార్ల(విప్లవ ప్రజా సమితి)ను ఏర్ప రచుకుని స్వయంపాలన దిశగా సాగుతున్నారు. జల్, జంగల్, జమీన్ లక్ష్యంగా సాయుధ బాటలో ఉద్యమిస్తున్నారు. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన దంతేవాడ, బీజాపూర్, సుక్మా, నారాయ ణపూర్ జిల్లాల్లో మూడంచెల పాలనా వ్యవస్థను ఏర్పాటుచేసుకుని దండకారణ్య రాష్ట్ర స్థాయి సర్కారు ఏర్పాటు లక్ష్యంగా పురోగమిస్తున్నారు. సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో వరుస ప్రభు త్వాలు అమలు చేస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు ప్రత్యామ్నాయంగా ఒక నూతన అభివృద్ధి నమూనాను దేశ ప్రజల ముందుంచుతున్నారు. సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేసుకుంటున్నారు. చెరువులు, కుంటలు నిర్మించుకుంటున్నారు. గ్రామగ్రామాన పాఠశాల

లను, ఆరోగ్యకేంద్రాలను ఏర్పాటుచేసుకుంటున్నారు. తమ మధ్య వచ్చే తగవులను న్యాయ కమిటీల ఆధ్వర్యంలో పరిష్కరించుకుంటున్నారు. అడవుల రక్షణకై అహర్నిశలూ శ్రమిస్తున్నారు. మూలవాసుల సంస్కృతిని సంరక్షించుకుంటున్నారు.

ఈ పరిణామం పాలకులకు మింగుడుపడలేదు. స్వాతంత్ర్యానంతర కాలంలో ఆదివాసీల వైపు కనీసం కన్నెత్తి చూడని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రంగంలోకి దిగాయి. గ్రీన్‌హంట్ పేరిట సైనికచర్యను ప్రారంభించి మూడేళ్లుగా ప్రజలపై ఉక్కుపాదం మోపుతున్నాయి. ఒక్క బస్తర్‌లోనే లక్షకు పైబడిన పోలీసు, పారామిలిటరీ బలగాలను మోహరించాయి. ఈ బలగాలు ఆదివాసుల స్వయంపాలన వ్యవస్థపైనే నేరుగా దాడి చేస్తున్నాయి. గ్రామాలపై మోర్టార్లతో బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. పాఠశాలలను, ఇళ్లను, ఆస్తులను కాలుస్తున్నాయి. కూలుస్తున్నాయి. దొరికిన వారిని కాల్చి చంపుతున్నాయి. లేదంటే చిత్రహింసలు పెట్టి జైళ్లకు పంపుతున్నాయి. మహిళలపై అత్యాచారాలకు తెగబడుతున్నాయి.

శాంతియుతంగా తమ పాలన తాము చేసుకుంటుంటే పోలీసుల బీభత్సకాండ ఎందుకో సగటు ఆదివాసీకి అర్థం కావడం లేదు. సరిహద్దులు కాపాడాల్సిన భారత సైన్యానికి ఇక్కడేం పనంటూ వాళ్లు అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. తరాలుగా తమను పట్టించుకోని పాలకులు ఇప్పుడు కూడా అలానే ఉంటే బాగుండునని ఆశపడుతున్నారు.



**మిలీషియా రక్షణలో చెరువు తవ్వకం పనులు చేస్తున్న గ్రామస్తులు**



సమష్టి వ్యవసాయ క్షేత్రంలో పండించిన వేరుశనగ

## 2

# నాలుగు జిల్లాల్లో స్వయంపాలన..

కటిక చీకట్లలో కడు పేదరికంతో కూడు, గూడు, గుడ్డ కరువైన దీన స్థితిలో బతుకుతున్న బస్తర్ ఆదివాసులకు 1980లలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రవేశించిన నక్సలైట్లు దేవుళ్లలా కనిపించారు. అభివృద్ధి పేరుతో అటవీ సంపదను, ఖనిజ వనరులను దోచుకెళుతున్న ప్రభుత్వాలు స్థానిక ప్రజలకు చేస్తున్నదేమీ లేదని అన్నలు చెప్పిన మాటలను మొదట వాళ్లు నమ్మలేదు. అయితే కాలక్రమంలో పాలకుల పట్టించుకోనితనం, అటవీ సిబ్బంది అరాచకాలు, కాంట్రాక్టర్ల, షావుకార్ల దోపిడి వారిని మావోయిస్టులకు దగ్గర చేశాయి. ఎక్కడి నుంచో వచ్చి తమ చుట్టూతా తిరుగుతూ తాము పెట్టింది తింటూ తమకు రాజకీయాలు నేర్పుతూ చివరకు తమ కళ్ల ముందే పోలీసు ఎన్‌కౌంటర్లలో బలికావడం వారిని కదిలించింది. మెల్లమెల్లగా ఉద్యమం వైపు అడుగులు వేశారు. సంగాల్లో సంఘటితమై తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశారు. కూడు, గూడు, గుడ్డ కావాలంటూ, కనీసావసరాలు తీర్చాలంటూ, కూలీరేట్లు పెంచాలంటూ ఎన్ని పోరాటాలు చేసినా పాలకుల్లో కనీస స్పందన కనపడలేదు. పైగా పోలీసు బలగాలను ప్రయోగించి అణిచివేయడం విధానంగా మార్చుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఆదివాసులు 2005 నుంచి మావోయిస్టుల నాయకత్వంలో స్వయంపాలన వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఊరూరా జనతన(ప్రజల)

## జనతన సర్కార్ల స్వరూపం..

గ్రామ స్థాయి–క్రాంతికారీ జనతన సర్కారు(విప్లవ ప్రజా సమితి–ఆర్పీసీ)

పరిధి– 500 నుంచి 3వేల మధ్య జనాభా కలిగిన 2, 3 గ్రామాలు

కమిటీ– 7 నుంచి 11 మంది సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు

ఎన్నిక– 18 సం.లు పైబడిన స్త్రీలు, పురుషులతో కూడిన గ్రామ్‌సభ.. ఎన్నిక కావడానికి కనీస వయసు 20 సం.లు

విభాగాలు– అభివృద్ధి, ఆరోగ్యం, విద్య–సాంస్కృతికం, అటవీ పరిరక్షణ, ఉపాధి, న్యాయ, ప్రజాసంబంధాలు, ప్రజారక్షణ

ఒక్కో విభాగాన్ని జనతన సర్కారు కమిటీ సభ్యుడొకరు పర్యవేక్షిస్తాడు. ఆయన ఆధ్వర్యంలో 3–7 మందితో సబ్‌కమిటీ పని చేస్తుంది.

సమావేశాలు–నెలకొకసారి. అత్యవసర పరిస్థితిలో ఎప్పుడైనా..

ఏరియా, డివిజన్ స్థాయిల్లోనూ నిర్మాణం ఇలాగే ఉంటుంది. వాటిని ఏరియా సర్కారు అనీ, డివిజన్ సర్కారు అనీ వ్యవహరిస్తున్నారు. ఏరియా సర్కార్లు గ్రామ సర్కార్ల, డివిజన్ సర్కార్లు ఏరియా సర్కార్ల బడ్జెట్‌ను, పనుల తీరును, ఇతర కార్యకలాపాలను పర్యవేక్షిస్తాయి.



గ్రామస్తునికి జ్వర పరీక్ష చేస్తున్న జనతన సర్కారు డాక్టరు

సర్కార్లను ఏర్పాటు చేసుకుని తమ అభివృద్ధికి తామే బాటలు వేసుకుంటున్నారు.

ప్రస్తుతం బస్తర్‌లోని నాలుగు జిల్లాల్లో జనతన సర్కార్ల నిర్మాణం ఉంది. వాటిపై ఏరియా సర్కార్ల అజమాయిషీ కొనసాగుతోంది. రెండు జిల్లాల్లో జిల్లా స్థాయి సర్కారు సైతం పనిచేస్తోంది. మిగతా రెండు జిల్లాల్లో కూడా జిల్లా స్థాయి నిర్మాణం చేపట్టి దండకారణ్య జోన్ సర్కారు ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని మావోయిస్టు పార్టీ నేత ఒకరు తెలిపారు. ఇందుకోసం జోన్ తయ్యారీ కమిటీ (జోన్ సన్నాహక కమిటీ) వేశామని ఆయన వెల్లడించారు. ఇక్కడి ప్రజలకు ప్రభుత్వమంటేనే తెలియదని, పోలీసులు, అటవీ సిబ్బంది మాత్రమే వారికి తెలుసునని ఆయన పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో స్వయంపాలనకు పూనుకుంటే తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. జనతన సర్కార్ల ఏర్పాటును వ్యతిరేకించే నైతిక హక్కు పాలకులకు లేదన్నారు. చేతనైతే ఆదివాసుల అభివృద్ధికై పాటు పడాలని హితవు పలికారు.

సుక్మా, బీజాపూర్, దంతేవాడ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో పర్యటించిన తర్వాత ఆ నాయకుడు చెప్పిన మాటల్లో నిజముందనిపించింది. ఏ పల్లెలోనూ కరెంటు లేదు.. పక్కా ఇళ్లు లేవు.. పిల్లలు చదువుకొనడానికి స్కూళ్లు లేవు.. జ్వరం వస్తే డాక్టర్ లేడు.. ధరించడానికి సరిపడ బట్టలు లేవు.. రోడ్లు లేవు.. ఎవరికీ రేషన్ కార్డులు కాని, ఓటరు గుర్తింపు కార్డులు కాని లేవు.. వ్యవసాయం వర్షాధారం.. ప్రాజెక్టులు, పథకాల ఊసే లేదు. బయటి ప్రపంచంలో ప్రతి ఇంట్లో కొలువైన టీవీ ఇక్కడ మచ్చుకైనా కానరాదు. తాగునీటి కోసం అక్కడక్కడా వేసిన బోర్‌వెల్స్‌లో మాత్రమే మనకు ప్రభుత్వం దర్శనమిస్తుంది.



**ఈ అడవి తమ జనతన సర్కారు పరిధిలోనిదంటూ తుమ్‌నారు పొలిమేరల్లో వెలిసిన రాతి బోర్డు**

## గ్రామస్థాయి క్రాంతికారీ జనతన సర్కారు

## అధ్యక్షుడు బుద్రూతో ఇంటర్వ్యూ..



*ఇప్పటికే మనకు ఒక ప్రభుత్వం ఉంది కదా! దాన్ని కాదని జనతన సర్కారు ఎందుకు ఏర్పాటుచేశారు?*

తాతలు తండ్రుల నుంచి మా జనం అభివృద్ధికి దూరంగా ఉన్నారు. ఇక్కడ ఏ సౌకర్యమూ లేదు. మమ్మల్ని ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. అందుకే మా అభివృద్ధి మేమే చేసుకుందామని నిర్ణయించుకున్నాం. మాలో నుంచే సర్కారును ఎన్నుకున్నాం.

*అలా చేయడం తప్పు కదా!*

తప్పెలా అవుతుంది? అభివృద్ధి వాళ్లు చేయరు. మమ్మల్ని చేసుకోనివ్వరా! ఊరందరం కలిసి సమిష్టిగా పనులు చేపడుతున్నాం. మేమేమీ నేరం చేయడం లేదు.

*ఏ ఏ పనులు చేస్తున్నారు?*

అన్ని ఊళ్లలో చెరువులు, కుంటలను నిర్మిస్తున్నాం. ప్రతి కుటుంబానికీ కనీసం ఐదెకరాల భూమి ఉండేలా చూస్తున్నాం. సమిష్టిగా వ్యవసాయం చేసి వడ్లు, పజ్జొన్న, పెసలు, అలిసెంతలు, బబ్బెర్లు, పల్లీలు పండిస్తున్నాం. అందరం పనిచేస్తాం. వచ్చిన పంటను అందరం పంచుకుంటాం. ఇటీవల భూమి లెవెలింగ్ పనులను చేపట్టాం. మా ఊళ్లో స్కూలు పెట్టాం. డాక్టర్‌గా కూడా మా పిలగాడు ఒకడు శిక్షణ పొందివచ్చాడు.

*వీళ్లకు జీతం ఏమైనా ఇస్తారా?*

అవును. భోజనం పెట్టి 500 రూ. ఇస్తున్నాం. మావాళ్లే కనుక ఆసక్తిగానే పనిచేస్తున్నారు.

*మీ సర్కార్లలో మావోయిస్టుల పాత్ర ఏమిటి?*

వాళ్లు మా పనిలో జోక్యం చేసుకోరు. ప్రారంభంలో మాకు గైడెన్స్ ఇచ్చారు. ఇప్పుడు అది కూడా లేదు. పోలీసులు మమ్మల్ని వేధించినప్పుడు మాత్రం మాకు అండగా నిలబడతారు.

*ప్రభుత్వం నుంచి మీరు ఏం ఆశిస్తున్నారు?*

మా దారిన మమ్మల్ని వదిలేయండి. జనతన సర్కార్లతో మేము ఎవరికీ నష్టం చేయడం లేదు. ఇన్నేళ్లు మమ్మల్ని పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా పట్టించుకోకండి. బలగాలను పంపి అమాయక ఆదివాసులను కష్ట పెట్టకండి.



శిక్షణ పొందుతున్న కొండపల్లి గ్రామ మిలీషియా

3

# విముక్తి వైపు పయనం!

ఎమర్జెన్సీ తదనంతరం కేంద్ర ఆర్గనైజర్ల రూపంలో రైతాంగాన్ని, యువతీ యువకులను ప్రజా సంగాల్లోకి సమీకరించిన నక్సలైట్లు ఆ తర్వాత క్రమంగా తమ నిర్మాణాలను పరిస్థితులకనుగుణంగా మార్చుకున్నారు. భూస్వాముల, గూండాల దాడుల నుంచి రక్షణ కోసం ఒక ఆర్గనైజర్, ఇద్దరు సభ్యుల(1+2) పద్ధతిని అమల్లోకి తెచ్చారు. ఆ సభ్యుల వద్ద తపంచాలు, నాటుబాంబులు ఉండేవి. ఆత్మరక్షణ కోసం పోలీసు బలగాలపై సైతం దాడి చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో 1985 నుంచి ఐదుగురి నుంచి 11 మంది వరకు గల దళాల నిర్మాణాన్ని చేపట్టారు. ఇదే చాలాకాలం కొనసాగింది. కాగా, 2000 డిసెంబర్‌లో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం(పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ–పీఎల్‌జీఏ) ఏర్పాటును ప్రకటించిన తర్వాత నిర్మాణాల్లో వేగవంతమైన మార్పు వచ్చింది. పార్టీని, సైన్యాన్ని విడదీశారు. సైన్యం రక్షణలో పార్టీ కార్యకర్తలు, కమిటీలు తమ విధులను నిర్వర్తించడం ఆరంభించారు. డివిజన్ల వారీగా, స్పెషల్ జోన్ల వారీగా ప్లాటూన్లు, కంపెనీల రూపంలో మిలిటరీ నిర్మాణాలను ఏర్పరచారు. పార్టీ రక్షణ కోసం లోకల్ దళాలను ఆర్గనైజు చేశారు.

బస్తర్‌లోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ప్రస్తుతం మూడు రకాల బలగాలున్నాయి. గ్రామ స్థాయిలో లోకల్ మిలీషియా పనిచేస్తోంది. ఇందులో భూంకాల్ మిలీషియా, గ్రామరక్షక దళం, మిలీషియా ప్లాటూను భాగంగా ఉంటాయి. వీరి వద్ద విల్లు–బాణాలు, గొడ్డళ్లు, బరిసెలు, కత్తులు, బర్మార్లు, నాటుతుపాకులు ఉంటాయి. భూంకాల్ మిలీషియా, గ్రామరక్షక దళం స్థానికంగా ఉంటూ ప్రజలకు రోజువారీ రక్షణను కల్పిస్తాయి. మిలీషియా ప్లాటూను మాత్రం ఆ ప్రాంతంలోకి పోలీసు

బలగాలు రాకుండా నిరోధక చర్యలు చేప డుతుంది. రోడ్లపై కందకాలు తవ్వడం, బూబీట్రాప్స్ అమర్చడం, పోలీసులు వస్తే వారిని చికాకు పరచే చర్యలను చేస్తుంది. దాడులు కూడా చేస్తుంది. ఈ ప్లాటూన్లకు మావోయిస్టులు త్రీనాట్‌త్రీ, ఎస్సెల్లార్, ఇన్సాస్ వంటి రైఫిళ్లను కూడా ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యమైన విషయమేమి టంటే లోకల్ మిలీషియాలోని సభ్యు లంతా మామూలుగా ఊళ్లోనే ఉంటారు. వ్యవసాయ పనులు చేస్తారు. అవసరమైన ప్పుడు మాత్రమే ఆయుధాలు పడతారు. ఆత్మరక్షణా చర్యలు చేపడతారు.



మిలీషియా ఏర్పాటు చేసిన బూబీట్రాప్స్

ద్వితీయ శ్రేణి బలగాలుగా లోకల్ గెరిల్లా దళాలు(ఎల్‌జీఎస్), లోకల్ ఆర్గనైజేషన్ దళాలు(ఎల్ ఓఎస్) పనిచేస్తున్నాయి. ఈ దళాలు పార్టీ కమిటీల వెంట ఉంటూ రక్షణ కల్పిస్తాయి. సంఖ్యను బట్టి ప్లాటూన్లుగా కూడా తిరుగుతాయి. ఆత్మరక్షణ కోసం మాత్రమే పోలీసులపై దాడి చేస్తాయి. వీరి వద్ద అన్ని రకాల తుపాకులు ఉంటాయి.

ఇక ప్రధాన బలగాలైన పీఎల్‌జీఏ ప్రస్తుతం ప్లాటూన్లు(20–30 మంది), కంపెనీలు(రెండు నుంచి మూడు ప్లాటూన్లు)గా సంఘటితమై ఉంది. ఈ బలగాల ప్రధాన కర్తవ్యం ప్రభుత్వ బలగాలు మావో

**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య కొనసాగుతున్న ఘర్షణలో ప్రాణనష్టాలు: (కేంద్ర హోంశాఖ గణాంకాలు)**

| సంవత్సరం | పౌరులు | భద్రతాబలగాలు | మావోయిస్టులు | మొత్తం |
|---|---|---|---|---|
| 2005 | 52 | 48 | 26 | 126 |
| 2006 | 189 | 55 | 117 | 361 |
| 2007 | 95 | 182 | 73 | 350 |
| 2008 | 35 | 67 | 66 | 168 |
| 2009 | 87 | 121 | 137 | 345 |
| 2010 | 72 | 153 | 102 | 327 |
| 2011 | 39 | 67 | 70 | 176 |
| 2012 | 26 | 36 | 46 | 108 |
| 2013 | 9 | 1 | 2 | 12 |
| **మొత్తం** | **604** | **730** | **639** | **1973** |

యిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోకి చొచ్చుకురాకుండా చూడడం. చొచ్చుకువచ్చినప్పుడు గెరిల్లా పద్ధ తుల్లో దాడులు చేయడం. నష్టాలు భరించయినా వాటి పురోగమనాన్ని నిరోధించడం. అవసరమై నప్పుడు రెండు లేదా మూడు కంపెనీలు కలిసి బెటాలియన్‌గా (మూడు నుంచి ఐదు కంపెనీలు)

**మావోయిస్టు పామేడ్ ఏరియా కమిటీ**

**కార్యదర్శి పాపారావుతో ఇంటర్వ్యూ..**



*సుప్రీంకోర్టు తీర్పు తర్వాత సల్వాజుడుం పరిస్థితి ఏమిటి?*

ఆ బలగాలను కోయ కమాండోలుగా మార్చి ప్రభుత్వ బలగాల్లో కలుపుకున్నారు. ఇప్పుడు వాళ్లు చట్టబద్ధంగానే పనిచేస్తున్నారు. వాళ్లు ఏర్పరిచిన నిర్బంధ శిబిరాలు దాదాపుగా ఖాళీ అయ్యాయి. మా ఏరియాలో ఒక్క జేగురుగొండలో మాత్రం కొనసాగుతోంది.

*ఇక్కడ అంతా జనతన సర్కార్ల హవా కొనసాగుతున్నట్లుంది?*

2007 నుంచి ఇక్కడి పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఉద్యమంలో ఆదివాసుల భాగస్వామ్యం బాగా పెరిగింది. ఏదో ఒక నిర్మాణంలో లేని గ్రామస్తులు ఇప్పుడు దాదాపు లేరనే చెప్పవచ్చు.

*పోలీసుల నిర్బంధం ఎలా ఉంది?*

గతంలో మాటిమాటికి గ్రామాలపై పడేవారు. ఇప్పుడు ఫ్రీక్వెన్సీ తగ్గింది. 7, 8 కంపెనీలు (సుమారు వేయి) ఉంటేగాని రావడం లేదు. అలా వచ్చినప్పుడు దొరికిన వారిని దొరికినట్లు కొడుతున్నారు. చంపుతున్నారు. అరెస్టు చేస్తున్నారు. మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారు. ఇళ్లను, జనతన సర్కారు స్కూళ్లను తగులబెడుతున్నారు. సామాను ధ్వంసం చేస్తున్నారు.

*ఈ మధ్యకాలంలో మీలో కొందరు సభ్యులు సరెండర్ అయ్యారు కదా!*

అవును. గెలుపుపై నమ్మకం లేని కొందరు సభ్యులు పోలీసులకు సరెండర్ అవుతున్నారు. అయితే మరోవైపు రిక్రూట్ అయ్యేవాళ్లు కూడా పెరుగుతున్నారు. ముఖ్యంగా యువతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

మీ దళంలో కొందరు మైనర్లుగా కనబడుతున్నారు. వాళ్లను తీసుకోవడం తప్పు కదా!

మైనర్లను మేము తీసుకోం. మాకు స్పష్టమైన పాలసీ ఉంది. పీఎల్‌జీఏలో చేరడానికి కనీస వయసు 18. మిలీషియాలో చేరడానికి కనీస వయసు 16. ఇక్కడి ప్రత్యేక పరిస్థితుల రీత్యా 18 పైబడిన కొందరు యువతీయువకులు తక్కువ వయసున్న వాళ్లలా అగుపిస్తారు. అంతే.

30 సంవత్సరాల మీ ఉద్యమంలో ఏం సాధించారు?

చాలా సాధించాం. ఆదివాసులను ఒక్కటి చేయగలిగాం. బయటి సమాజంలో వారికి గుర్తింపును తేగలిగాం. అడవులను పరిరక్షిస్తున్నాం. వ్యవసాయాన్ని అభివృద్ధి చేశాం. విద్య, వైద్యం మెరుగుపడింది. శుభ్రత పెరిగింది. ప్రజలు సంతోషంగా బతుకగలుగుతున్నారు.



రెండు పోలీసు క్యాంపులను కలిపే రోడ్డుపై మిలీషియా తవ్విన కందకం

ఏర్పడి భారీ దాడికి పాల్పడే సామర్థ్యాన్ని సైతం ప్రస్తుతం మావోయిస్టులు కలిగివున్నారు.

మేము పర్యటించిన ప్రాంతాల్లో ఎక్కడా పోలీసు బలగాల జాడలు కనిపించలేదు. అవి బాస గూడెం, జేగురుగొండ, ఆవుపల్లి, కుంట, బీజాపూర్, దంతేవాడ, సుక్మా వంటి క్యాంపులకే పరిమితమయ్యాయని స్థానికులు తెలిపారు. గ్రామగ్రామాన మమ్మల్ని మిలీషియా సభ్యులు ఆపారు. మా వెంట ఉన్న స్థానికులను గుర్తు పట్టి పత్రకార్ లోకుర్ (విలేకరులు) వచ్చారంటూ షేక్‌హ్యాండిచ్చి పక్కకు తప్పుకున్నారు. మేము ఇంటర్వ్యూ చేసిన ఇద్దరు ఏరియా కమిటీ కార్యదర్శుల వెంట తప్ప మాకు యూనిఫాంలో ఉన్న దళాలు కాని, పీఎల్‌జీఏ బలగాలు కాని ఎక్కడా తటస్థపడలేదు. ఇదే విషయాన్ని ఓ సీనియర్ నేత వద్ద ప్రస్తావించగా తమ పీఎల్‌జీఏ బలగాలు శత్రు క్యాంపుల చుట్టూ రానే తచ్చాడుతాయని, అవకాశం దొరికినప్పుడల్లా గెరిల్లా పద్ధతుల్లో వాటిపై దాడి చేస్తాయని అన్నారు. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, కమిటీలు తమ పనులను యథావిధిగా కొనసాగిస్తుంటాయన్నారు. గెరిల్లా యుద్ధం నుంచి తాము సంచార(మొబైల్) యుద్ధ తంత్రం వైపు అడుగులేస్తున్నామని చెప్పారు.

మరోవైపు, పెద్ద ఫార్మేషన్లకు వెళ్లిన తర్వాత ఇరుపక్షాల వైపునా ప్రాణనష్టాలు తగ్గాయని, వేయి దాటిన సంఖ్యలో బలగాలుంటే తప్ప శత్రువు తమ ప్రాంతాల్లో అడుగు పెట్టడం లేదని జేగురుగొండ



మిలీషియా ఏర్పాటుచేసిన ఫేక్ బూబీట్రాప్స్



తర్ఫీదు పొందుతున్న ఎల్ఓఎస్ ప్లాటూను

ఏరియా కమిటీ కార్యదర్శి పాపారావు మాకు తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలకు ముందే సమాచారం అందుతుంది కనుక వృద్ధులు, పసిపిల్లలు తప్ప మిగతావాళ్లంతా ఇళ్లను వదిలి అడవిలోకి వెళ్లి తలదాచుకుంటారన్నారు. పోలీసులు వచ్చి ఖాళీగా ఉన్న ఇళ్లను చూసి ఆగ్రహించి సరుకు, సామాగ్రిని తగులబెడుతున్నారని, ముసలోళ్లను కూడా కొడుతున్నారని వివరించారు. పోలీసుల భయంతోనే ప్రస్తుతం గ్రామస్తులు తమ గాసంలో ఎక్కువ భాగాన్ని అడవిలో దాచిపెట్టి ఒక వారానికి సరిపడ సామాను మాత్రం ఇంట్లో ఉంచుకుంటున్నారని తెలిపారు.

కేంద్ర హోంశాఖ గణాంకాలు కూడా ఇదే విషయాన్ని రుజువుపరుస్తున్నాయి. 2005లో మావోయిస్టుల దాడుల్లో 48 మంది ప్రభుత్వ బలగాల జవాన్లు మరణించగా, 2006లో 55 మంది, 2007లో 182 మంది, 2008లో 67 మంది, 2009లో 121 మంది, 2010లో 153 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత (చింతల్నారు దాడి తర్వాత) అవి తమ కదలికల పద్ధతిని మార్చుకుని పెద్దసంఖ్యలో మాత్రమే వెళుతున్న ఫలితంగా నష్టాలు తగ్గాయి. 2011లో 67 మంది,

2012లో 36 మంది, 2013 ఫిబ్రవరి 24 వరకు ఒకరు మాత్రమే బలయ్యారు. మరోవైపు మావో యిస్టుల వైపు నష్టాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 2009 వరకు పెరిగిన నష్టాలు ఆ తర్వాత తగ్గాయి.(టేబుల్ చూడండి)

ప్రస్తుతం సుక్మా, బీజాపూర్, దంతేవాడ, నారాయణపూర్ జిల్లాలకు చెందిన సుమారు పది వేల చదరపు కిలోమీటర్లకు పైగా భూభాగం మావోయిస్టులకు స్థావరంగా మారినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. మావోయిస్టులు 100 నుంచి 200 మధ్య సంఖ్యలో సంచరిస్తున్నా రని, గెరిల్లా తరహాలో ఆకస్మిక దాడులకు దిగుతున్నారని పేర్కొంటున్నాయి. ఈ ప్రాంతంలోని పెద్ద గ్రామాలు, పట్టణాల్లో ఉన్న పోలీసు క్యాంపులకు సరుకుల సరఫరా సైతం హెలికాప్టర్ల ద్వారా జరు గుతోందని, ఇటీవల మావోయిస్టులు హెలికాప్టర్లపైనా కాల్పులు జరుపుతున్న నేపథ్యంలో ఇది కూడా కష్టంగా మారిందని ఆ వర్గాలు తెలిపాయి.



**జనతన సర్కారు సాయంతో ఇళ్లు నిర్మించుకుంటున్న మహిళ**



అడవిలో కూంబింగ్ నిర్వహిస్తున్న ప్రభుత్వ బలగాలు

4

# పోలీసుల ఉక్కుపాదం..

బస్తర్‌లో రాజ్యమేలుతున్న జనతన సర్కార్లను, మావోయిస్టు గెరిల్లాల ప్రాబల్యాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. విచ్చలవిడిగా హింసకు పాల్పడడం, హెలికాప్టర్లపై సైతం తెగబడడాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. వామపక్ష తీవ్రవాదాన్ని సమూలంగా నిర్మూలిస్తే తప్ప దేశాభివృద్ధి సాధ్యం కాదని, మధ్యభారతంలో వివిధ బహుళజాతి సంస్థలతో కుదుర్చుకున్న ఎంఓయూలు అమలు చేయడం కుదరదని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పదేపదే ఉద్ఘాటిస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ రంగంలోకి దిగింది. దండకారణ్యం, ఆంధ్రా–ఒరిస్సా, జార్ఖండ్–బెంగాల్, జార్ఖండ్–బీహార్ సరిహద్దు ప్రాంతాల నుంచి మావోయిస్టులను ఏరివేయడంపై దృష్టి కేంద్రీకరించింది. ఈ ప్రాంతాల్లో మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదటి, రెండో దశలు అనుకున్న ఫలితాలను సాధించకపోవడంతో మరోమారు ఏం చేయాలో నిర్ణయించుకునే పనిలో పడింది. ఆర్మీ, పారామిలిటరీకి చెందిన ఉన్నతాధికారులతో పాటు నక్సల్ ప్రాబల్య రాష్ట్రాల డీజీపీలతో పలుమార్లు సమావేశమవుతోంది. వైఫల్యాలకు కారణాలను సమీక్షిస్తోంది. ఏది ఏమైనా వెనక్కి తగ్గకూడదని, మరిన్ని వనరులను కూడదీసుకుని ఈ వేసవిలో గ్రీన్‌హంట్ మూడవ దశను ఆరంభించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు అవసరమైన ప్లానులు, ఎత్తుగడలు ఇప్పటికే సిద్ధమయ్యాయని, మరిన్ని బలగాల

మోహరింపు ప్రక్రియ కూడా కొనసాగుతోందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఈసారి విఫలమైన పక్షంలో 2014 వేసవి నాటికి ఆర్మీ ఆపరేషన్ చేపట్టాలనే అవగాహనకు కూడా కేంద్ర కేబినెట్ వచ్చినట్లు తెలుస్తోంది. అబూజ్‌మాడ్ కొండల వద్ద ఇప్పటికే సైనిక శిక్షణ కేంద్రం పేరిట స్థావరాన్ని నెలకొల్పి బ్రిగేడ్ స్థాయిలో బలగాలను ఉంచడం, ఆర్మీ చీఫ్ సహా పలువురు సైన్యాధికారులు బస్తర్ పర్యటించి వెళ్లడం, జగ్దల్‌పూర్‌లో ఆర్మీ సబ్‌ఏరియా హెడ్‌క్వార్టర్స్(15 వేల జవాన్లు) నెలకొల్పడానికి నిర్ణయించడం ఈ ప్లానులో భాగమేనని కొందరు వాదిస్తున్నారు.

## లక్ష్యాన్ని సాధించని గ్రీన్‌హంట్ మొదటి దశ..

నిజానికి 2009 నవంబర్‌లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదటి దశ ప్రారంభమైనప్పుడు కూడా భారత సైన్యాన్ని రంగంలోకి దించాలని అప్పటి హోం మంత్రి చిదంబరం తదితరులు వాదించారు. ఆ ప్రతిపాదనకు ఆర్మీ అధికారులతో పాటు కేబినెట్ సమ్మతించకపోవడంతో సుమారు 55 బెటాలియన్ల పారామిలిటరీ దళాలను దించి, వారికి దన్నుగా వాయుసేన హెలికాప్టర్లను మాత్రం మోహరించారు. ఒక్క బస్తర్‌లోనే 20వేల పారామిలిటరీ, మరో 20 వేల స్థానిక బలగాలను సమీకరించారు. అయితే, బలగాల వ్యూహాన్ని ముందే పసిగట్టిన మావోయిస్టులు భారీ ప్రతిఘటనకు పూనుకున్నారు. అనేక దాడుల్లో డజన్ల కొలదీ ప్రభుత్వ బలగాలను అంతమొందించారు. తాడిమెట్ల దాడిలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఒక కంపెనీని పూర్తిగా నిర్మూలించగలిగారు. తమ వద్ద ఉన్న ఎల్ఎంజీలు, రైఫిళ్ల సాయంతోనే హెలికాప్టర్లపైనా కాల్పులు జరిపి శత్రువుకు నష్టం కలిగిస్తున్నారు. స్థానికంగా సమాచారమిచ్చే ఇన్ఫార్మర్ల వ్యవస్థ లేకపోవడం, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సల్వాజుడుం బలగాలను రద్దు చేసి కోయ కమాండోలుగా మార్చడం, స్థానికుల మద్దతు



ప్రభుత్వ బలగాలు తగులబెట్టిన తుమ్‌నారు ఆశ్రమ పాఠశాల



**పోలీసులు తగులబెట్టిన ఇంటి ముందు దీనంగా కూర్చున్న ఆదివాసీ మహిళలు, పిల్లలు**

మావోయిస్టులకే ఉండడం తదితర కారణాల మూలంగా ప్రభుత్వ బలగాలు చొరవ కోల్పోయి గ్రీన్‌హంట్ మొదటి దశ నీరుగారిపోయింది.

## కొనసాగుతున్న రెండవ దశ..

మొదటి దశ వైఫల్యాలను చర్చించి సమీక్షించిన కేంద్ర హోంశాఖ 2011 చివరలో గ్రీన్‌హంట్ రెండవ దశను ప్రారంభించింది. ఇందులో భాగంగా మరిన్ని పారామిలిటరీ బలగాలను కేంద్రీకరించి పోలీసు క్యాంపుల సంఖ్యను రాసిలోనూ వాసిలోనూ బాగా పెంచారు. బస్తర్‌లోని దంతేవాడ, సుక్మా, బీజాపూర్, నారాయణపూర్, కాంకేర్ జిల్లాల్లోని అన్ని క్యాంపులను బలోపేతం చేశారు. జగ్దల్‌పూర్ కేంద్రంగా మానవరహిత విమానాల, హెలికాప్టర్ల సేవలను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. వేయికి మించిన బలగాలతో లోతట్టు ప్రాంతాలకు చొచ్చుకెళ్లి ఉద్యమకారుల నైతికస్థైర్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆపరేషన్ హాకా, ఆపరేషన్ విజయ్‌లను చేపట్టి అబూజ్‌మాడ్ కొండల పైకి వెళ్లగలిగారు. దక్షిణ, పశ్చిమ, తూర్పు బస్తర్‌లలో సైతం అనేక పోలీసు అభియాన్లను నిర్వహించారు. 19 మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయిన సర్కిన్‌గూడ ఘటన ఈ దాడుల్లో భాగంగానే జరిగింది. ఈ సందర్భంగా అనేక మంది జనతన సర్కారు సభ్యులను, మావోయిస్టు మిలిటెంట్లను అరెస్టు చేశారు.

## గ్రామాలను ఖాళీ చేయించడమే లక్ష్యం..

వివిధ రకాల చర్యల ద్వారా ఆదివాసీలను గ్రామాల నుంచి ఖాళీ చేయించడం ప్రస్తుత రెండవ

దశలో జరుగుతోందని కొందరు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఊళ్లపైబడి ఇళ్లను తగులబెట్టడం, ఆస్తుల విధ్వంసం, మావోయిస్టు మద్దతుదారుల వేధింపులు, మోర్టార్లతో బాంబులు వేయడం లాంటివన్నీ ఈ ఎత్తుగడల్లో భాగమేనని వారంటున్నారు. ఏదో రకంగా గ్రామాల నుంచి ఆదివాసు లను పెద్ద గ్రామాలు, పట్టణాల్లోని ప్రత్యేక శిబిరాలకు తరలించగలిగితే మావోయిస్టుల పనిపట్టడం చాలా సులువని ప్రభుత్వ బలగాలు భావిస్తున్నాయని వారు చెబుతున్నారు. మా పర్యటనలో మేము గమనించిన విషయాలు కూడా ఈ వాదననే బలపరుస్తున్నాయి. మమ్మల్ని అడవిలో ఉండకుండా చేస్తున్నారని ఆదివాసీలు వాపోయారు. మాతో మాట్లాడిన ఓ మావోయిస్టు నేత సైతం ఈ విష యాన్ని ఒప్పుకున్నారు. ఆదివాసులను టెర్రరైజ్ చేయడం, టెర్రయిన్ పరిశీలన, స్థానికంగా ఇన్ఫా ర్మర్ల నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ఈ దాడుల లక్ష్యాలని చెప్పారు.

## ఈ ఎండాకాలం కీలకం..

మార్చి నుంచి చెట్ల ఆకులు రాలి అడవి పలచబడుతుంది కనుక ఈ ఎండాకాలం అటు ప్రభుత్వ బలగాలకు, ఇటు మావోయిస్టులకు చాలా కీలకం కాబోతోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక్క బస్తర్‌లోనే లక్షకు మించిన పారామిలిటరీ బలగాలను దించి, స్థానిక బలగాలను కూడా కలుపుకుంటే శిక్షణలోనూ, ఆయుధసంపత్తిలోనూ, సరఫరాల్లోనూ ప్రత్యర్థి కంటే ఎంతో వెనకబడివున్న మావోయిస్టులకు కష్టకాలమేనని వారు పేర్కొంటున్నారు. ఎక్కడంటే అక్కడ నీళ్లు అందుబాటులో లేకపోవడం మావోయిస్టులకు ప్రమాదకరంగా పరిణమించనుందని, వారిని నిలబెట్టే ఏకైక అంశం ప్రజల మద్దతేనని వివరిస్తున్నారు.



పోలీసులు ధ్వంసం చేసిన పాఠశాల గది

## ఆదివాసులను హింసిస్తున్నారు..

సోని, మావోయిస్టు పామేడ్ ఏరియా కమిటీ కార్యదర్శి



***జనతన సర్కార్లు ఇంత బలంగా ఉన్నా పోలీసులు దాడి ఎలా చేయగలుగుతున్నారు?***

గతంలో మా నిర్మాణాల్లో పనిచేసి లొంగిపోయిన వారి సాయంతో దాడి చేస్తున్నారు. అలాగే మేమంటే పడని కొందరు వ్యక్తులు సంతలకు వెళ్లినప్పుడు సమాచారం ఇస్తున్నారు. అయినా దాడులు ఎప్పుడంటే అప్పుడు జరగడం లేదు. కేవలం వేయికి పైబడిన బలగాలుంటే మాత్రమే వస్తున్నారు. చాలాసార్లు ముందే ప్రజలకు సమాచారం అందుతుంది. వారంతా ఇళ్లను వదిలి అడవిలోకి వెళతారు. అయితే కొన్నిసార్లు పోలీసులు రహస్యమార్గంలో అడవులు, గుట్టల గుండా వచ్చినప్పుడు జనం బలవుతున్నారు.

***పోలీసులు జనాలనే ఎందుకు వేధిస్తున్నారు?***

జనతన సర్కార్లు ఏర్పాటు చేసుకుని తమ అభివృద్ధి తామే చేసుకుంటుండడం ప్రభుత్వాలకు కంటగింపుగా మారింది. అందుకే ప్రజలపై ప్రతాపం చూపిస్తున్నారు. వాళ్లను భయపెట్టడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని వారి ఉద్దేశం.

***మహిళలపై పోలీసుల వేధింపులపై మీ అభిప్రాయం?***

ఢిల్లీ అత్యాచార ఘటనపై తీవ్రంగా స్పందించిన సభ్యసమాజం ఇక్కడ బస్తర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను పట్టించుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా మహిళా సంఘాలు, పౌరహక్కుల సంఘాలు ఇక్కడికి వచ్చి నిజానిజాలు పరిశీలించాలి. బయటి ప్రపంచానికి తెలియజెప్పాలి. ఈ మార్చ్ 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగానైనా ఆ నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నా.

***మీ పార్టీలోనూ మహిళలపై వివక్ష ఉందనే ప్రచారం ఉంది..***

అది నిజం కాదు. అందుకు నేనే సాక్ష్యం. నేను చాలా సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాను. ఎప్పుడూ వివక్ష ఎదుర్కోలేదు. మహిళా సమస్యలపై మా పార్టీ వైఖరి స్పష్టంగా ఉంది కనుకనే వాళ్లే అధికంగా రిక్రూట్ అవుతున్నారు.

***దళాల్లో వంట పని మహిళలే చేస్తారా?***

అలా ఏం లేదు. అందరికీ డ్యూటీలు ఉంటాయి. పురుషులైనా, మహిళలైనా అన్ని పనులు చేయాల్సిందే. మహిళలు పైస్థాయి కమిటీల్లో కూడా ఉన్నారు. భారీదాడుల్లో పాల్గొంటున్నారు. కమాండర్లుగా నేతృత్వం వహిస్తున్నారు. మిలిటరీ ట్రెయినింగ్ ఇస్తున్నారు. అదంతా దుష్ప్రచారం.

5

# గ్రామాల్లో బీభత్సకాండ..

శతాబ్దాలుగా కడు దీనావస్థలో బతుకుతున్న ఆదివాసులను ఏనాడూ పట్టించుకోని ప్రభుత్వాలు వాళ్లు ఉద్యమిస్తే మాత్రం యుద్ధ ప్రాతిపదికన స్పందిస్తున్నాయి. కూలీ రేట్లు పెంచాలని, కాంట్రాక్టర్ల దౌర్జన్యాలు అరికట్టాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నోసార్లు సభలు పెట్టినా, ర్యాలీలు తీసినా, బంద్‌లు నిర్వహించినా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. విసిగి వేసారి చివరకు మావోయిస్టుల గైడెన్స్‌లో స్వయంపాలనకు పూనుకుంటే మాత్రం వెంటనే బలగాలను దించి భయపెట్టే, బలప్రయోగం చేసే ఎత్తుగడలకు పాల్పడుతున్నారు. జనతన సర్కార్ల ఆధ్వర్యంలో లోకల్ మిలీషియా బలపడడం, పీఎల్‌జీఏ పెద్ద ఫార్మేషన్లకు వెళ్లడం మూలంగా పోలీసులు తరచూ రావడం తగ్గింది కాని అప్పుడప్పుడు వేయికి మించిన బలగాలతో అభియాన్(ఆపరేషన్)లు చేపట్టి గ్రామాలపై పడి బీభత్సం సృష్టించడం జరుగుతోంది. ఇళ్లను కాల్చడం, కూల్చడం, సామగ్రిని చిందరవందర చేయడం, జనతన సర్కార్లకు చెందిన బళ్లను, వ్యవసాయ క్షేత్రాలను ధ్వంసం చేయడం, దొరికినవారినల్లా కొట్టడం, అరెస్టు చేసి జైళ్లలో పెట్టడం సాధారణమైపోయిందని మేము పర్యటించిన పలు గ్రామాల ప్రజలు వివరించారు. బస్తర్ నుంచి బలగాలు వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేశారు. రేంగం, సింగం, పీడియా, తుమ్‌నారు తదితర గ్రామాల ప్రజలతో మేము మాట్లాడాం.



ప్రభుత్వ బలగాల చేతిలో వేధింపులకు గురైన ఆదివాసీ మహిళలు

వాళ్లు చెప్పిన విషయాలు ఇలా ఉన్నాయి.

జనవరి 21న వివిధ దిశల నుంచి వచ్చిన వందలాది బలగాలు బీజాపూర్ జిల్లాలోని తుమ్‌నారు ఆశ్రమ పాఠశాలపై దాడి చేశారు. ముందే సమాచారం అందిన విద్యార్థులు గ్రామస్తుల ఇళ్లల్లోకి వెళ్లి దాక్కున్నారు. టీచర్లు కూడా పారిపోవడంతో ఆగ్రహించిన పోలీసులు తరగతి గదులను, యూనిఫాంలను, దుప్పట్లను, వంట సామగ్రిని కాల్చివేశారు. వంట గదిని, స్టాఫ్‌రూంను, జనతన సర్కారు జెండాగద్దెను కూల్చివేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. బోర్డులు విరగ్గొట్టారు. సల్వాజుడుం బలగాల దాడుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు 40 మంది ఈ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నారు. బస్తర్ మొత్తంలో ఇలాంటివి మరో మూడు ఆశ్రమ పాఠశాలలుండగా వాటిని గతంలోనే కూల్చివేశారని టీచర్ సునీల్ మాకు వివరించారు. పీడియాలోని కొందరు సంగ సభ్యుల ఇళ్లను కూడా ఇదేవిధంగా కాలబెట్టి ధాన్యం వగైరా పారబోశారు. ఆ గ్రామంలో ఉన్న అమరుల స్తూపాన్ని రాకెట్ లాంఛర్‌తో కూల్చివేశారు.

ఫిబ్రవరి 4న పూసూరు బ్లాక్ రేంగం గ్రామంలో ఆంధ్ర గ్రేహౌండ్స్–ఛత్తీస్‌గఢ్ పోలీసు సంయుక్త బలగాలకు, మావోయిస్టు గెరిల్లాలకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యంలో ఆ గ్రామంపై పోలీసులు విరుచుకుపడ్డారు. ఆ గ్రామంలో బంధువు చావుకు వచ్చిన పలువురు మహిళలను పోలీసులు పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించారు. మీరు నక్సలైట్లేనంటూ బట్టలు విప్పి అవమానించారు. రేంగంకు చెందిన మడ్కాం బీమె అనే గర్భవతిని కొడితే అబార్షన్ అయింది. సింగంకు చెందిన సోడి బీమెను కట్టుకున్న చీర ఎక్కడిదంటూ కొట్టారు. మడ్కాం సోమ్రిని లోదుస్తులు వేసుకున్నావు కనుక నువ్ మావోయిస్టువేనని కొట్టి లుంగీతో ఉరివేసి చంప ప్రయత్నించారు. కుంజం మూయె, మడ్కాం మంగ్లి, దేవె, బూద్రిల బట్టలు విప్పి అవమానించారు. తుమిడంకు చెందిన మాడ్వి పోసి అనే మహిళ నీళ్ల కోసం వెళితే పట్టుకుని తీవ్రంగా కొట్టారు. ఇప్పటికీ ఆమె నిలబడలేకపోతోంది. మడ్కాం నంది అనే యువతి పోలీసుల నుంచి తప్పించుకునేందుకు తనకు చిన్న పాప ఉందని అబద్ధమాడితే పాలు పిండి చూపించమన్నారు. సింగంకు చెందిన మాడ్వి కోసను టీ షర్టు వేసుకున్నందుకు చితకబాదారు. ఈ మూడు గ్రామాల్లోని పలు ఇళ్లపై దాడి చేసి వేలాది రూపాయల నగదును, కోళ్లను, మేకలను ఎత్తుకెళ్లారు. కొందరు పురుషులను పట్టుకెళ్లి జైళ్లో పెట్టారు.

ఫిబ్రవరి 9న బయంపెల్లిని చుట్టుముట్టి ఒకరిని అరెస్టు చేసి తీసుకెళ్లగా గ్రామస్తులంతా వెళ్లి జేగురుగొండ క్యాంపును దిగ్బంధించారు. విడిచిపెడతాం.. సర్పంచిని వదిలివెళ్లలండంటూ సముదాయించి, ఆ తర్వాత సర్పంచును కూడా అరెస్టు చేశారు. డిసెంబర్‌లో అవుట్‌పల్లి, కొర్సగూడెంలపై దాడి చేసి చాలా మందిని అరెస్టు చేశారు. కోళ్లను, కోడిగుడ్లను, మేకలను, నగదును ఎత్తుకెళ్లారు. నవంబర్‌లో కొర్సగూడెం పైబడి కటికెం మున్నీ అనే యువతిని కొట్టి చంపారు. మడ్కాం పొజ్జాల్‌ను చెట్టుకు వేలాడదీసి కొట్టారు. ఇదే నెలలో పువ్వర్తి గ్రామంలో ఉన్న జనతన సర్కారు స్కూలుపై దాడి చేయగా విద్యార్థులు పారిపోయి వరిపొలంలో దాక్కున్నారు. ఈ స్కూళ్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు రిట్రీట్ పాఠాలు చెప్పడం విశేషం. గంగులూరు, సర్కిన్ పోలీసు క్యాంపులకు సమీపంలో ఉన్న గ్రామాలపై తరచూ మోర్టార్లతో షెల్స్(బాంబులు) వేయడం జరుగుతోందని ఆ గ్రామాలకు చెందిన ప్రజలు చెప్పారు. క్యాంపు నుంచి 3, 4 కి.మీ.ల దూరం ప్రయాణించి నేలపై పడి పేలే ఈ బాంబులు ఎక్కడ పడతాయో తెలియదన్నారు. ఈ బాంబుల భయంతో తాము పంట పొలాల్లో పనులు చేసుకునే పరిస్థితి లేదని వాపోయారు.

## మమ్మల్ని అవమానిస్తున్నారు..

**మంగ్లి, రేంగం గ్రామస్తురాలు**

మా బంధువు చనిపోతే రేంగం వెళ్లాం. అక్కడ పోలీసులు పట్టుకుని నక్సలైటువంటూ కొట్టారు. నాకు పెళ్లయిందని చెప్పినా వినిపించుకోలేదు. బట్టలు విప్పి చెక్ చేశారు. బ్రా ఉంది కనుక నువ్ మావోయిస్టువన్నారు. ఎంత మొత్తుకున్నా వినలేదు.



## సైన్యం వెనక్కి వెళ్లాలి..

**సుక్కు, పీడియా గ్రామస్తుడు**

ఎక్కడో ఉండాల్సిన భారత సైన్యం ఇక్కడకు ఎందుకు రావాలి. పొలం పనులు చేస్తుంటే బాంబులు వేస్తున్నారు. ఈ దేశంలో ఆదివాసులు బతక్కూడదా! మేం ఏ నేరం చేశాం. మా వికాస్ మేము చేసుకోవడం తప్పా. భారత ఫౌజ్ వెంటనే వెనక్కి వెళ్లాలని మీరు వెళ్లి చెప్పండి..



# 6

# అణచివేతే పరిష్కారమా?

ప్రభుత్వ బలగాలకూ మావోయిస్టుల నాయకత్వంలో ఉద్యమిస్తున్న బస్తర్ ఆదివాసులకూ మధ్య కొనసాగుతున్న యుద్ధం చివరి అంకానికి చేరింది. జనతన సర్కార్లను ధ్వంసం చేయడమే లక్ష్యంగా మావోయిస్టు శక్తులను భౌతికంగా నిర్మూలించడమే మార్గంగా ప్రభుత్వ బలగాలు పావులు కదుపుతున్నాయి. చేపలు పట్టడానికి నీళ్లను చల్లేసినట్లు మావోయిస్టులను ఒంటరి చేయడానికి గ్రామాల నుంచి ఆదివాసులను ఖాళీ చేయించే పనిలో పడ్డాయి. ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు నడుపుతున్న మావోయిస్టులను అదుపులోకి తేవాలంటే అణచివేత తప్ప మరోమార్గం లేదని, మధ్యభారత అడవుల్లో శాంతిభద్రతలను నెలకొల్పడం ద్వారా అభివృద్ధికి బాటలు వేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. దశాబ్దకాలంలో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని, వేదాంత, పోస్కో, జిందాల్, మిట్టల్ వంటి బడా కంపెనీలు ఇక్కడి వనరులను వెలికితీసి కాసులవర్షం కురిపిస్తాయని, స్థానికులకు అందులో భాగం ఉంటుందని పేర్కొంటున్నాయి. అభివృద్ధికాముకులైన వారంతా వామపక్ష తీవ్రవాదంపై తాము ఆరంభించిన పోరుకు మద్దతు తెలపాల్సిందిగా ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్, ఆర్థిక మంత్రి చిదంబరం పిలుపునిస్తున్నారు. ఇదే ఎజెండాతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేష్ దేశంలోని మారుమూల ప్రాంతాలన్నీ తిరుగుతూ ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు నైతిక మద్దతు కూడగట్టే పనిలో పడ్డారు. మావోయిస్టుల ప్రాబల్యాన్ని తగ్గించడం కోసం కార్పొరేట్లు సమర్పించే నిధులను సైతం ఉపయోగించుకోవాలని నిర్ణయించారు.

## పాలకుల వివక్ష వల్లే నక్సల్స్ వైపు..

తరతరాలుగా పాలకులు చూపుతున్న వివక్ష వల్లే ఆదివాసులు మావోయిస్టులకు దగ్గరయ్యారన్నది జగమెరిగిన సత్యం. స్వాతంత్ర్యం వచ్చేవరకూ స్వేచ్ఛ కోసం బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా భూంకాల్, గుండాదుర్ వంటి వీరుల నేతృత్వంలో పోరాడిన గిరిపుత్రులు తదనంతరం తీవ్రనిర్లక్ష్యానికి గురయ్యారు. అప్పటిదాకా తెగపెద్దలు, గోండు రాజుల పర్యవేక్షణలో కొనసాగిన స్వయంపాలనను కుప్పకూల్చిన నయా పాలకులు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల మాటటుంచి అటవీ చట్టాల పేరుతో గిరిజనులను పీడించే వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఈ విషయాన్ని పీడియా గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు మాతో చాలా సూటిగా చెప్పాడు. తెల్లోల్ల జమానాలోనే ఎవరి జోక్యమూ లేకుండా బతికాం.. ఇప్పుడు స్వతంత్ర భారతంలో తమను మనుషుల్లా గుర్తించడం లేదని వాపోయాడు. తన జీవితకాలంలో ఇక్కడ ప్రభుత్వం చేసిందేమీ లేదని తేల్చిచెప్పాడు.

## ప్రత్యామ్నాయం లేకనే జనతన సర్కార్లు..

పార్టీలు, ప్రభుత్వాలు ఏవీ పట్టించుకోని పరిస్థితుల్లో బస్తర్‌కు వచ్చిన నక్సలైట్లు చాలా కొద్దికాలంలోనే ఆదివాసులకు దగ్గరయ్యారు. వాళ్ల నాయకత్వంలో అటవీ సిబ్బంది అరాచకాలకు గోరీ కట్టారు. తునికాకు సేకరణ, వెదురు నరకడం తదితర పనుల్లో కూలీరేట్లను పెంచుకున్నారు. కాంట్రాక్టర్ల నుంచి ఊరుమ్మడి నిధులు వసూలు చేసి కాస్తో కూస్తో అభివృద్ధికి పునాదులు వేశారు. అప్పటిదాకా గిరిజన ప్రాంతాల వైపు కన్నెత్తి చూడని అధికారులు నక్సలైట్లు తిరుగుతున్నారనగానే పోలీసు



అబూజ్‌మాడియా తెగకు చెందిన పురుషుడు

బలగాల రూపంలో స్పందించారు. దుడ్డుకర్ర చూపిస్తూనే మరోవైపు తాయిలాల ఆశ చూపించారు. వారిని నమ్మని ఆదివాసులు అన్నల వైపు మరింత దృఢంగా నిలిచారు. సర్కారును నమ్ముకుంటే ప్రజల బతుకులు మారవని, మన అభివృద్ధిని మనమే చేసుకుందామంటూ వారు చెప్పిన మాటలను విశ్వసించారు. అలా ప్రభుత్వం నుంచి స్పందన లేని పరిస్థితుల్లోనే జనతన సర్కార్ల రూపంలో ఓ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఉనికిలోకి వచ్చింది. స్థానిక వనరులు, శ్రమశక్తి, ఉత్పత్తి సాధనాలపై ఆధారపడిన ఈ వ్యవస్థ మంచి ఫలితాలనే ఇవ్వడంతో మరిన్ని గ్రామాల ప్రజలు స్ఫూర్తిని పొందారు. అలా గ్రామ సర్కార్లు, ఏరియా, డివిజన్ సర్కార్లుగా ఎదిగి దండకారణ్య స్థాయికి వెళ్లాయి.

## మానవజాతి మనుగడకు ముప్పు..

మన్మోహన్‌సింగ్ చేయలేని పనిని బస్తర్ ఆదివాసులు చేస్తున్నారని మాతో మాట్లాడిన తన పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ మావోయిస్టు మహిళా నాయకురాలు తెలిపారు. స్వదేశీ వనరులను విదేశీ బహుళజాతి కంపెనీలకు దఖలుపరుస్తున్న మన్మోహన్ ఇక్కడికి వచ్చి ఆదివాసుల అభివృద్ధి నమూనాను పరిశీలించాలని ఆమె కోరారు. ఆర్థిక వ్యవహారాల్లో నిపుణుడిగా పేరుగాంచిన ఆయన తన తెలివిని భారతదేశ స్వావలంబనకు ఉపయోగిస్తే మేలు జరుగుతుందన్నారు. బస్తర్‌లో ప్రభుత్వ బలగాల నిర్బంధాన్ని వ్యతిరేకించడమనేది అమాయక ఆదివాసులు బాధలనుభవిస్తున్నారనే కోణంలో చేయనక్కరలేదని చెప్పారు. మన్మోహన్ తలపెట్టినట్లుగా మధ్యభారతాన్ని వేదాంత, పోస్కో, టాటా, జిందాల్‌లకు అప్పగిస్తే అడవులేవీ మిగలవని వివరించారు. అడవులు లేని భారతాన్ని ఒకసారి ఊహించుకోండని ఆమె మేధావులకు, పర్యావరణవేత్తలకు సూచించారు. తెలంగాణ, ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్రల్లోని అనేక జిల్లాల్లో అడవులు అంతరించడం మూలంగానే

వర్షాలు తగ్గాయని, రుతువుల సమతుల్యత దెబ్బతిందని వివరించారు. దండకారణ్యంలోని అడవులే ప్రస్తుతం మధ్యభారతం కరువుకాటకాల్లోకి వెళ్లకుండా కాపాడుతున్నాయన్నారు. ఆ అడవులను బస్తర్ ఆదివాసులు ప్రాణాలకు తెగించి కాపాడుతున్నారన్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా లేదంటే సైన్యం దిగి రేపు ఈ అడవుల నుంచి ఆదివాసులను పారదోలి, బహుళజాతి కంపెనీలకు అప్పగిస్తే మానవజాతికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.

## అడవిని విడిస్తే ఆదివాసీలకు బతుకు లేదు..

పుట్టి పెరిగిన ఊళ్ల నుంచి, తల్లిలా ఆదరించిన అడవి నుంచి ఆదివాసులను వేరుచేసే ఎత్తుగడలను ప్రస్తుతం ప్రభుత్వ బలగాలు చేపట్టాయన్నది స్పష్టమేనని సైనిక వ్యవహారాల నిపుణుడొకరు వ్యాఖ్యానించారు. అడవి నుంచి వారిని పంపిస్తే మావోయిస్టులను తుడిచిపెట్టడం సులభమవుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే సైన్యాధికారుల్లో మానవీయకోణాన్ని ఆశించడం భ్రమే అవుతుందన్నారు. గిరిజనుల బాగోగుల సంగతి ప్రభుత్వాలు ఆలోచించాల్సివుంటుందన్నారు. ఇదే విషయమై ఓ సామాజికవేత్తను ప్రశ్నించగా అడవుల నుంచి బయటకు వచ్చిన గిరిజనుడు బతకలేడన్నారు. నీటి నుంచి బయటపడ్డ చేపపిల్లలా గిజగిజ కొట్టుకుంటాడని, నిత్యం ప్రకృతి ఒడిలో సేదదీరినవాడు కాంక్రీట్ జంగిల్‌లో పిచ్చివాడుగా మారడం ఖాయమని వివరించారు. అభివృద్ధి పేరుతో మూడవ ప్రపంచదేశాల్లో ఎక్కడైనా జీవనవిధ్వంసమే జరిగిందని, ఇక్కడ కూడా అదే జరుగుతుందని తెలిపారు. ఒరిస్సాలో వేదాంత కంపెనీ చేపట్టిన మైనింగ్ మూలంగా డోంగ్రియా, కుటియా కోందుల అస్తిత్వానికి ముప్పు ఏర్పడిందని, ఇప్పుడు గ్రీన్‌హంట్ మూలంగా బస్తర్‌లోని అబూజ్‌మాడ్ గుట్టలపై నివసిస్తున్న ప్రపంచంలోనే అతిపురాతన తెగల్లో ఒకటైన అబూజ్‌మాడియాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో జీవవైవిధ్య సదస్సును ఆర్భాటంగా నిర్వహించిన భారత ప్రభుత్వం వృక్ష, జంతుజాలాల పరిరక్షణ సంగతటుంచి ఆదిమ జాతులను కాపాడుకునే చర్యలు చేపట్టాలని కోరారు.

## దాడులు ఆపేయాలి.. శాంతిచర్చలు జరపాలి..

కాగా, మధ్యభారతంలో కొనసాగుతున్న పోలీసు, పారామిలిటరీ బలగాల దాడులను వెంటనే ఆపాలని దేశంలోని ప్రజాస్వామికవాదులు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు. జనతన సర్కార్లు ప్రజాస్వామిక స్ఫూర్తితో కొనసాగుతున్నాయని, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు ప్రత్యామ్నాయాన్ని చూపిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇందుకు కారణమైన మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించి వారి శక్తియుక్తులను సమాజం కోసం ఉపయోగించుకోవాలని కోరుతున్నారు. ప్రతి వ్యక్తికీ కూడు, గూడు, గుడ్డ, భూమి, బతికేందుకు ఉపాధి చూపించడం, స్వావలంబన బాటలో దేశాన్ని నడిపించడమే మావోయిస్టుల ఎజెండా కనుక వెంటనే కేంద్రప్రభుత్వం శాంతిచర్చలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.